RNI. No. APTEL/2011/41055




# ప్రభాత సమాచారం

తెలంగాణ తెలుగు దినపత్రిక




సంపుటి : 15 సంచిక : 142 ఆదిలాబాద్ ఎడిటర్ - సయ్యద్ కరీం మంగళవారం, 25 నవంబర్ 2025 పేజీలు : 4 వెల : 2/-

# ఆడబిడ్డల అభ్యున్నతికి అన్ని చర్యలు తీసుకుంటున్నాం



## కొడంగల్ ప్రజల 70 ఏళ్ల కల నెరవేరబోతుంది

### త్వరలోనే రైలు కూత వినబోతున్నారు : సీఎం రేవంత్ రెడ్డి

కొడంగల్, నవంబర్ 24: ఆడబిడ్డలు సంతోషంగా ఉంటే.. రాష్ట్రంలో ఆర్థికాభివృద్ధి ఉంటుందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం కొడంగల్ బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ఆడబిడ్డల ఆత్మగౌరవంతో బతికేలా ఉండాలని తమ ప్రభుత్వం మహిళల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందని వివరించారు. ప్రతి పేద తల్లి కళ్లల్లో ఆనందం చూడాలని సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. రూ. 500లకే గ్యాస్ సిలిండర్ అందిస్తున్నామన్నారు. మహిళలకు ఆర్టీసీలో ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించామని గుర్తు చేశారు. అదానీ, అంబానీలతో పోటి పడేలా సోలార్ ప్లాంట్స్ నిర్వహణను మహిళలకు అప్పగించామని వివరించారు. మహిళలకు ఆర్థిక స్వాతంత్ర్యం కల్పించామని వివరించారు. హైటెక్ సిటీ శిల్పారామంలో మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను మార్కెటింగ్ చేసుకునేందుకు స్టాల్స్ సైతం ఏర్పాటు చేశామని వివరించారు. ఆడబిడ్డలు తయారు చేసిన ఉత్పత్తులు అంతర్జాతీయ మార్కెట్‌లో విక్రయించేందుకు అమెజాన్‌తో సంప్రదింపులు జరుపుతున్నామని పేర్కొన్నారు.

మీ జీవితాల్లో వెలుగులు నింపేందుకు మంచి చదువు అందించడం ఒక్కటే మార్గమని సూచించారు. మీ పిల్లలు గొప్పగా చదువుకుంటేనే మీ జీవితాల్లో మార్పు సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. అందుకే అక్షయ పాత్ర ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని 312 ప్రభుత్వ పాఠశాలల్లో 28 వేల మంది విద్యార్థులకు ఉదయం బ్రేక్ ఫాస్ట్ అందిస్తున్నామని చెప్పారు. ఏ విద్యార్థి ఆకలితో ఇబ్బంది పడకుండా ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. సెంట్రలైజ్డ్ కిచెన్ ద్వారా మధ్యాహ్న భోజనాన్ని అందించే కార్యక్రమం తీసుకువస్తున్నామన్నారు. బిడ్డల గురించి కన్నతల్లి ఆలోచించినట్లుగా... తమ ప్రభుత్వం ఆలోచించి వారి ఆకలి తీరుస్తోందని తెలిపారు. ఎడ్యుకేషన్, ఇరిగేషన్ రంగాలకు తమ ప్రభుత్వ తొలి ప్రాధాన్యత ఇస్తుందన్నారు. కొడంగల్ నియోజకవర్గానికి మెడికల్, వెటర్నరీ, అగ్రి, పారామెడికల్, నర్సింగ్, ఇంజనీరింగ్ కళాశాలలు , ఏటీసీలను, ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్, జూనియర్, డిగ్రీ కళాశాలలు, సైనిక్ స్కూల్ తీసుకొచ్చామని వివరించారు. విద్య ఒక్కటే తరగని ఆస్తి అని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. రాష్ట్ర నలుమూలల నుంచి గొప్ప చదువుల కోసం కొడంగల్‌కు వెళ్లాలనేలా ఈ అసెంబ్లీ నియోజకవర్గాన్ని ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దుతున్నామన్నారు. 16 నెలల్లో అంతర్జాతీయ స్థాయి ఎడ్యుకేషన్ హబ్‌గా కొడంగల్‌ను మార్చాలని ప్రయత్నిస్తున్నామని పేర్కొన్నారు. కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు కోసం రైతులు స్వచ్ఛందంగా భూములు ఇస్తున్నారని చెప్పారు. మూడేళ్లల్లో ప్రాజెక్టు పూర్తి చేసి కొడంగల్ భూములను కృష్ణా జలాలతో తడుపుతామని విశ్వాసం వ్యక్తం చేశారు . లగచర్ల పారిశ్రామిక వాడను అంతర్జాతీయ పారిశ్రామిక వాడగా తీర్చి దిద్దుతామని స్పష్టం చేశారు. త్వరలోనే కొడంగల్ ప్రజలు రైలు కూతను కూడా వినబోతున్నారన్నారు. కొడంగల్ ప్రజల 70 ఏళ్ల కల నెరవేరబోతుందన్నారు.

మరో తొమ్మిది నెలల్లో రైల్వే లైన్ ఏర్పాటు పనులు ప్రారంభంకానున్నాయని తెలిపారు. కొడంగల్ నియోజకవర్గంలో సిమెంట్ పరిశ్రమలు సైతం ఏర్పాటు కాబోతున్నాయని వివరించారు. అభివృద్ధిలో కొడంగల్ నియోజకవర్గాన్ని రాష్ట్రానికి ఒక మోడల్‌గా మారుస్తామని చెప్పారు. సర్పంచ్ ఎన్నికల్లో మంచి వ్యక్తులను ఎన్నుకోండంటూ ప్రజలకు సూచించారు. ఆడబిడ్డలకు ప్రభుత్వం అందిస్తున్న సారె ఇందిరమ్మ చీరలని.. ఇవి ప్రతి ఆడబిడ్డకు చీర చేరేలా చూడాలని అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. పదేళ్లు రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం అధికారంలో ఉంటుందని జోస్యం చెప్పారు. రాజకీయాలకు అతీతంగా కొడంగల్‌ను అభివృద్ధి చేసుకునేందుకు ముందుకు రావాలంటూ ప్రజలకు పిలుపునిచ్చారు. అభివృద్ధికి అండగా ఉండాలని ఈ సందర్భంగా ఆడబిడ్డలను సీఎం రేవంత్ రెడ్డి కోరారు.

# ఆయుధాలు వీడేందుకు సిద్ధం




## మావోయిస్టుల సంచలన ప్రకటన

ముంబై: ఆయుధ విరమణపై మావోయిస్టులు సంచలన ప్రకటన చేశారు. తాము ఆయుధాలు వీడేందుకు సిద్ధంగా ఉన్నామని మావోయిస్టులు లేఖ విడుదల చేశారు. ఈ మేరకు మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రులకు లేఖ రాశారు. ఆపరేషన్ కగార్‌లో భాగంగా మూడు రాష్ట్రాల్లో కూంబింగ్ ఆపరేషన్ నిలిపివేస్తే ఆయుధ విరమణ తేదీని ప్రకటిస్తామని లేఖలో పేర్కొన్నారు. దీంతో, సర్వత్ర ఉత్కంఠ నెలకొంది. వివరాల ప్రకారం.. ఆయుధాలు వీడే విషయమై మావోయిస్టులు తాజాగా లేఖ విడుదలు చేశారు. ఈ మేరకు మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల ముఖ్యమంత్రులకు లేఖలను పంపించారు. మావోయిస్టు ప్రతినిధి పేరుతో సీఎంలకు లేఖ అందింది. ఈ లేఖలో మావోయిస్టులు తాము ఆయుధాలు వీడి, సాధారణ జనజీవన స్రవంతిలో కలిసేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. ముఖ్యంగా, కేంద్ర కమిటీ సభ్యుడు కామ్రేడ్ సోను దాదా తీసుకున్న 'పోరాటం నిలిపివేయాలన్న' నిర్ణయానికి తాము పూర్తి మద్దతు ఇస్తున్నామని ఈ లేఖలో స్పష్టంగా పేర్కొన్నారు. ఈ మావోయిస్టు ప్రతినిధులు ఆయుధాలు విడిచిపెట్టి, ప్రభుత్వ పునరావాస పథకాలను పొందాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.

**ఫిబ్రవరి 15, 2026 వరకు సమయం...** ఈ లేఖలో మావోయిస్టులు.. ఎంఎంసీ జోన్‌లోని మావోయిస్టులందరూ సామూహికంగా లొంగిపోతారు. ఎప్పటి నుంచి ఆపరేషన్ కూంబింగ్‌ను నిలిపివేస్తారో.. అప్పుడే మేము ఆయుధాలను వీడటం జరుగుతుంది. ఆ వెంటనే ఆయుధాల విరమణ తేదీని ప్రకటిస్తాం అని పేర్కొన్నారు. అలాగే, మావోయిస్టులు తమ ఈ కీలక నిర్ణయంపై సమష్టి నిర్ణయానికి రావడానికి కొంత సమయాన్ని కోరారు. ఈ నిర్ణయాన్ని పూర్తిగా అమలు చేయడానికి తమకు ఫిబ్రవరి 15, 2026 వరకు సమయం ఇవ్వాలని వారు ప్రభుత్వాలను అభ్యర్థించారు. ఈ విజ్ఞప్తి వెనుక ఎలాంటి నిగూఢ ఉద్దేశం లేదని, కేవలం అంతర్గతంగా చర్చించుకోవడానికి, తుది నిర్ణయాన్ని నిర్ధారించుకోవడానికి మాత్రమే ఈ సమయం అవసరమని వారు లేఖలో స్పష్టం చేశారు.

**ఆపరేషన్ కగార్..** అయితే, ఆపరేషన్ కగార్ కొనసాగుతున్న నేపథ్యంలో మావోయిస్టుల అభ్యర్థనను ప్రభుత్వాలు ఏ విధంగా స్వీకరిస్తాయనేది ఆసక్తికరంగా మారింది. మావోయిస్టుల ప్రతిపాదనను స్వాగతిస్తూ ఎలాంటి చర్యలు లేదా హామీలు ఇస్తాయనే చర్చ మొదలైంది.


మావోయిస్టులు అడిగిన సమయం లోపల, ఈ రాష్ట్రాల ప్రభుత్వాలు, భద్రతా బలగాలు కూడా తమ వ్యూహాలను సమీక్షించుకోవాల్సిన అవసరం ఉంటుంది. మొత్తానికి మావోయిస్టుల ఆయుధ విరమణ లేఖ సంచలనంగా మారింది. ఈ లేఖ మావోయిస్టు ఉద్యమ చరిత్రలో ఒక మలుపుగా పరిగణించవచ్చు.




## నూతన సీజేఐగా జస్టిస్ సూర్యకాంత్ ప్రమాణస్వీకారం

న్యూఢిల్లీ: భారతదేశ 53వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సూర్యకాంత్ ప్రమాణస్వీకారం చేశారు. రాష్ట్రపతి భవన్‌లో సోమవారంనాడు జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆయన చేత ప్రమాణస్వీకారం చేయించారు. ఆదివారంనాడు పదవీ విరమణ చేసిన సీజేఐ బిఆర్ గవాయ్ స్థానంలో జస్టిస్ సూర్యకాంత్ బాధ్యతలు స్వీకరించారు.

2027 ఫిబ్రవరి 9వ తేదీ వరకూ ఈ పదవిలో కొనసాగనున్నారు. సీజేఐగా బాధ్యతలు చేపట్టిన తొలి హరియాణా వాసిగా జస్టిస్ సూర్యకాంత్ రికార్డు సృష్టించారు. ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో తొలిసారిగా భూటాన్, కెన్యా, మలేసియా, మారిషస్, నేపాల్, శ్రీలంక దేశాల చీఫ్ జస్టిస్‌లు వారి కుటుంబ సభ్యులతో కలిసి హాజరుకావడం విశేషం. జస్టిస్ సూర్యకాంత్ 1962 ఫిబ్రవరి 10న హరియాణాలోని హిసార్‌లో ఓ మధ్యతరగతి కుటుంబంలో జన్మించారు. 1984లో రోహ్‌తక్‌లోని మహర్షి దయానంద్ యూనివర్శిటీ నుంచి న్యాయశాస్త్ర పట్టా పొందారు. 2004 జనవరి 9న పంజాబ్, హర్యానా హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2018లో హిమాచల్ ప్రదేశ్ హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా నియమితులయ్యారు. 2019 మే 24న సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. వివిధ ధర్మాసనాల్లో పలు కీలక తీర్పుల్లో ఆయన భాగమయ్యారు. 370వ అధికరణను రద్దు చేస్తూ చారిత్రక తీర్పు ఇచ్చిన ధర్మసనంలో ఉన్నారు. బిహార్ ఎన్నికల జాబితా రివిజన్, పెగాసస్ స్పైవేర్ తీర్పులు కూడా ఉన్నాయి.




# తెలుగు రాష్ట్రాల్లో ఎన్నికల జాతర!

# ఒకేసారి స్థానిక సమరం..

## కొత్త ఏడాదిలో మారనున్న లెక్కలు

హైదరాబాద్ / అమరావతి : రెండు తెలుగు రాష్ట్రాల్లో స్థానిక ఎన్నికల మేఘాలు కమ్ముకొస్తున్నాయి. తెలంగాణలో పంచాయతీ ఎన్నికలకు ప్రభుత్వం ఇప్పటికే సై అంటోంది. ఏపీలో కూడా ఎన్నికల సంఘం నుంచి అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తవుతున్నాయి. తెలంగాణలో పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్లు ఖరారుచేస్తుండగా, ఏపీలో 175 నియోజకవర్గాల నుంచి ఓటర్ల జాబితాను రాష్ట్ర ఎన్నికల సంఘం సేకరించింది. రిజర్వేషన్లు ఖరారు చేస్తే ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉన్నామని ప్రభుత్వానికి తెలియజేసింది. దీంతో కొద్దిరోజుల్లోనే రెండు రాష్ట్రాల్లో స్థానిక సమరంపై సైరన్ మోగే అవకాశాలు ఉన్నాయంటున్నారు. తెలంగాణలో బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచాలని ప్రభుత్వం గతంలో భావించింది. ఆ మేరకు జీవో జారీ చేసింది. ఎన్నికల షెడ్యూల్ కూడా ఎన్నికల సంఘం విడుదల చేసింది. అయితే రిజర్వేషన్ల పెంపును కోర్టు తోసిపుచ్చడంతో ఎన్నికల నోటిఫికేషన్ రద్దైపోయింది. ఇక ఇప్పట్లో పెంచిన రిజర్వేషన్ల ప్రకారం ఎన్నికలు నిర్వహించడం సాధ్యం కాదన్న ఆలోచనకు వచ్చిన తెలంగాణ ప్రభుత్వం.. పాత రిజర్వేషన్ల ప్రకారం ఎన్నికలకు వెళ్లాలని నిర్ణయించింది. 2018 నాటి పంచాయతీరాజ్ చట్టం ఆధారంగా రిజర్వేషన్లు ఖరారు చేయాలని ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. సర్కారు సూచనలతో రిజర్వేషన్లను ఖరారు చేస్తూ అధికారులు ప్రకటన విడుదలకు సన్నాహాలు చేస్తున్నారు. ఇక ఏపీలో కూడా ఎన్నికల నిర్వహణకు సర్వసన్నద్ధంగా ఉన్నట్లు ఎన్నికల సంఘం సంకేతాలిస్తోంది. ఓటర్ల జాబితాను ఇప్పటికే సిద్ధం చేసింది. రిజర్వేషన్లు ఖరారు చేయడమే ఆలస్యమని, వెంటనే ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసేందుకు రెడీ అంటూ ప్రభుత్వానికి సమాచారం పంపింది. ఏపీ ప్రభుత్వం కూడా స్థానిక ఎన్నికల నిర్వహణకు పూర్తి సన్నద్ధంగా ఉండటంతో ఏ క్షణంలో అయినా ఎన్నికల రిజర్వేషన్లపై ఆదేశాలు విడుదల అయ్యే అవకాశాలు ఉన్నాయంటున్నారు. తెలంగాణలో స్థానిక ఎన్నికలకు ఎప్పుడో గడువు ముగిసింది. ఏపీలో వచ్చే ఏడాది ఫిబ్రవరిలో పంచాయతీలకు, మార్చిలో మున్సిపాలిటీలకు గడువు ముగియనుంది. మూడు నెలల ముందుగా ఎన్నికలు నిర్వహించాలని గతంలో ప్రభుత్వం భావించింది. ఆ మేరకు డిసెంబరులో ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేసింది. కానీ, ప్రభుత్వం మాత్రం జనవరి తర్వాతే ఎన్నికలు నిర్వహించాలన్న ఆలోచనలో ఉందని చెబుతున్నారు. ప్రస్తుతం ప్రభుత్వపరంగా అన్నివిధాలుగా సమాయత్తమైనా కేడర్ ను సన్నద్ధం చేయాల్సివుందని ప్రభుత్వం ఆలోచనగా ఉందంటున్నారు. మొత్తానికి ఇరు రాష్ట్రాల్లో జనవరి నుంచి ఎన్నికలు జరిగే అవకాశాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. పంచాయతీలు, మున్సిపాలిటీలు, మండల, జిల్లా పరిషత్ ఎన్నికలు వరుసగా నిర్వహించేందుకు రెండు ప్రభుత్వాలు సన్నద్ధమవుతున్నాయి. దీంతో జనవరిలో సంక్రాంతి పండుగ తర్వాత ఎన్నికల పండుగకు తెరలేస్తుందని అంటున్నారు. ఇక ఈ ఎన్నికల్లో మెజార్టీ స్థానాలు దక్కించుకునేందుకు అధికార పార్టీలు వ్యూహాలు రచిస్తున్నాయని అంటున్నారు.

# సంపాదకీయం

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

## బీహార్ లో కూడా బుల్డోజర్ దిగుతుందా ?

బీహార్ లో నితీష్ కుమార్ నాయకత్వం లోని ఎన్డీయే ప్రభుత్వం తాజాగా కొలువు తీరింది. ఈ ప్రభుత్వంలో కీలకమైన హోం శాఖను నితీష్ కుమార్ వదులుకుని బీజేపీకి చెందిన ఉప ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరికి అప్పగించారు. దీంతో ఇపుడు ఇదే అంశం మీద బీహార్ రాజకీయం హీటెక్కుతోంది నితీష్ ని డమ్మీ చేయడానికి బీజేపీ చూస్తోంది అని కాంగ్రెస్ ఆర్జేడీ అపుడే కామెంట్స్ మొదలెట్టాయి. అంతే కాదు నితీష్ కుమార్ ని సొంత ప్రభుత్వంలోనే క్రియాశీలకంగా లేకుండా చేసే ప్రయత్నం ఇది అని కూడా చెబుతున్నారు.

**పవర్ ఫుల్ గానే :** నిజానికి చూస్తే సామ్రాట్ చౌదరి ఈసారి సీఎం కావాల్సిన వారు అని చెబుతున్నారు. ఆయన గత ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రిగా పనిచేశారు. మరోసారి ఎన్డీయే సర్కార్ వస్తే కనుక సామ్రాట్ చౌదరిని సీఎం గా చేస్తారు అని కూడా ప్రచారం సాగింది. కానీ బీజేపీ పెద్దలు జాతీయ రాజకీయాలను అలాగే వచ్చే ఏడాది జరిగే మరో నాలుగు రాష్ట్రాల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని నితీష్ కుమార్ ని కదపకుండా అదే పదవిని అప్పగించారు. నితీష్ సైతం ముఖ్యమంత్రిగానే కొనసాగాలని నిర్ణయించుకున్నారు. దాంతో ఆయన కూడా హ్యాపీగా ఉన్నారు. ఈ ఉత్సాహంలో ఆయన రెండు దశాబ్దాలుగా తాను చూస్తున్న హోంశాఖని బీజేపీకి అప్పగించారు.

**తప్పేముందన్న జేడీయూ నేతలు :** అయితే ఈ పరిణామం మీద అగ్గి రాజేసి ఎన్డీయే కూటమిలో చిచ్చు పెట్టేందుకు విపక్షం అపుడే చూస్తోంది అని అంటున్నారు. అనుభవం కలిగిన నేతగా ఉన్న సామ్రాట్ చౌదరికి హోం శాఖను ఇస్తే తప్పేంటి అని జేడీయూ నేతలు ప్రశ్నిస్తున్నారు. ఇది తమ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అని అంతా ఒక్కటే అని వారు అంటున్నారు. అయితే ఇది జేడీయూని అణిచివేసేందుకే అని విపక్షాలు రాద్ధాంతం చేస్తున్నాయి. అంతే కాదు ఏకంగా బీహార్ ని కేంద్రం తన కనుసన్నలలో నడుపుతుందని కూడా కాంగ్రెస్ ఆర్జేడీ నేతలు ఆరోపిస్తున్నారు.

**పాలన ఆయనదే :** పేరుగే నితీష్ కుమార్ సీఎం అని పాలన అంతా సామ్రాట్ చౌదరి చూస్తారని కూడా కాంగ్రెస్ ఆర్జేడీ విమర్శలు గుప్పిస్తున్నారు. హోం శాఖ పవర్ ఫుల్ అని అందుకే సామ్రాట్ చౌదరి పాలన చేస్తారు అని అంటున్నారు. కేవలం సీటు మాత్రమే నితీష్ ది తప్ప మిగిలినది అంతా బీజేపీదే అని కూడా వారు సెటైర్లు వేస్తున్నారు. జేడీయూ ఇక మీదట వీక్ కావడం ఖాయమని జోస్యం చెబుతున్నారు.

**బుల్డోజర్ పాలన :** ఇదిలా ఉంటే యూపీలో బీజేపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ పాలిస్తున్నారు. ఆయన బుల్డోజర్ ని దింపి మరీ నేరాలను అదుపు చేస్తున్నారు. బీహార్ లో కూడా లా అండ్ ఆర్డర్ మరింత కఠినంగా అమలు చేయాల్సి ఉందని జనాల నుంచి వినిపిస్తున్న మాట ఈ నేపథ్యంలో బీజేపీ చేతిలో హోం శాఖ ఉంది కాబట్టి బీహార్‌లో సైతం బుల్డోజర్ పాలన వస్తే బాగుంటుందని కొందరు అంటూంటే అది ప్రత్యర్థుల మీదకే ప్రయోగిస్తారని మరి కొందరు అంటున్నారు. ఏది ఏమైనా రెండు పెద్ద రాష్ట్రాలు హిందీ బెల్ట్ లో ఉన్నాయి. యూపీలో యోగీ మాదిరిగా బీహార్ లో లా అండ్ ఆర్డర్ ని కంట్రోల్ లో పెట్టడానికి బీజేపీ హోం శాఖ తీసుకుందా అన్న చర్చకు అయితే తెర లేస్తోంది.

# సరిహద్దు నిర్ధారణ.. చెరువుల సంరక్షణ!



హైదరాబాద్: ఔటర్ రింగ్ రోడ్డు(ఓఆర్ఆర్)లోపల చెరువులకు ఆక్రమణల నుంచి విముక్తి కల్పించేందుకు ప్రయత్నాలు జరుగుతు న్నాయి. ఇందుకోసం పూర్తి నీటి నిల్వ స్థాయి (ఎఫ్‌టీఎల్) నిర్ధారిస్తూ ప్రాథమిక, శాశ్వత నోటిఫికేషన్ల జారీకి 222 చెరువుల వివరాలను హెచ్ఎండీఏ హైడ్రాకు పంపింది. హైడ్రా చొరవ చూపితే.. వెంటనే నోటిఫికేషన్లు జారీ చేయవచ్చునని అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే ప్రధాన నగరంలోని పలు తటాకాల్లో ఆక్రమణల తొలగింపు, పునరుద్ధరణకు హైడ్రా చర్యలు చేపడుతోంది 3 వేల తటాకాలకు.. హెచ్ఎండీఏ కిందకు వచ్చే ఏడు జిల్లాల పరిధిలో 3,532 చెరువులు ఉన్నాయి. వీటికి ఎఫ్‌టీఎల్, ఇతర హద్దుల గుర్తింపు ప్రక్రియ నడుస్తోంది. ఇప్పటికే 3 వేల తటాకాలకు ఎఫ్‌టీఎల్ గుర్తింపునకు ప్రాథమిక నోటిఫికేషన్, 1300 జలవనరులకు సర్వే నిర్వహించి శాశ్వత నోటిఫికేషన్ జారీ చేశారు. వీటిని ఇకపై ఆక్రమించడం దాదాపు సాధ్యం కాదు. ప్రయత్నం చేసినా.. వెంటనే గుర్తించే అవకాశం ఉంది. ఓఆర్ఆర్ లోపలి వరకు చెరువులను హైడ్రా పరిధిలోకి తెచ్చారు. ప్రస్తుతం ఆ సంస్థ పరిధిలో 222 ఉన్నాయి. వీటికి హద్దులు నిర్ధారించి నోటిఫికేషన్లు ఇవ్వాలని ఆయా జిల్లాల కలెక్టర్లు హైడ్రా దృష్టికి తీసుకెళ్లినట్లు తెలుస్తోంది.

**ఆక్రమణలకు అడ్డులేదు..**

ఓఆర్ఆర్ పరిధిలోని చెరువుల ఎఫ్‌టీఎల్‌కు సంబంధించి నోటిఫికేషన్లు రాకపోవడంతో ఆక్రమణలకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. రామంతాపూర్‌లోని పెద్ద చెరువే అందుకు ఉదాహరణ. ఇప్పటికే ఎఫ్‌టీఎల్‌లో అక్రమ భవనాలను నిర్మిస్తున్నప్పటికీ ఎవరూ పట్టించుకోవడం లేదు. ఓ వ్యక్తి ఏడు అంతస్తుల భవనాన్నే నిర్మిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

# హద్దులు మీరి.. చెరువులను ఆక్రమించి



కరీంనగర్ : పెద్దపల్లి పట్టణంలో 65 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న బంధంపల్లి చెరువు క్రమంగా ఆక్రమణకు గురవుతోంది. శిఖం భూమి కొంత కబ్జాకు గురైంది. పట్టణంలో ఉన్న బండారి కుంట గడిచిన రెండు దశాబ్దాలుగా పూర్తిగా ఆనవాళ్లు లేకుండా పరాధీనమైంది. వెంచర్లు ఏర్పాటు చేసి పట్టాలను అమ్ముకుని ఎంచక్కా భవనాల నిర్మాణాలు చేపట్టేశారు. 5.2 ఎకరాల పరిధిలో విస్తరించి ఉన్న రంగంపల్లి చెరువు బఫర్ జోన్‌ను కొందరు చెరబట్టారు. సుల్తానా బాద్ పెద్ద చెరువును కొందరు ఆక్రమిస్తున్నారని గతంలో కలెక్టరుకు ఫిర్యాదు అందటంతో హద్దులు నిర్ణయించారు. అయినా శిఖం భూమికి అక్కడక్కడా ఆపద పొంచి ఉంది. రామగుండం నగరపాలక సంస్థ పరిధిలోని మల్లపురాణి కుంట విషయంలోనూ ఫిర్యాదులు వస్తే యంత్రాంగం హద్దులు ఏర్పాటు చేసింది.

జిల్లాలోని ఆయకట్టు చెరువుల ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మాణాలుంటున్నాయని తరచూ ప్రజావాణిలో ఫిర్యాదులు అందుతున్నాయి. అయినా అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలున్నాయి. ఫలితంగా చెరువులు క్రమంగా ఆక్రమణలకు గురవుతున్నాయి.

**అరెకరం నుంచి ఆపై..**

జిల్లావ్యాప్తంగా పెద్దపల్లి, మంథని, రామగుండం, సుల్తానాబాద్ పట్టణ ప్రాంతాల్లో చాలా వరకు చెరువులు రూపును కోల్పోయాయి. ఇక పలు మండలాల్లోని 100 ఎకరాల ఆయకట్టున్న తటాకాలకు కబ్జా బెడద ఎక్కువైంది. చాలా ఊళ్లల్లో అర ఎకరం నుంచి ఆపై రెండు, మూడు, అయిదెకరాల దాక ఆక్రమణ చెరలోకి వెళ్లిన ఉదంతాలున్నాయి. జిల్లావ్యాప్తంగా 1,016 చెరువులున్నాయి. ఇందులో దాదాపుగా 20 శాతం చెరువుల్లో ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ స్థలాల్లో నిర్మాణాలు జరిగాయి. కొన్ని చోట్ల ప్రభుత్వ అవసరాలకు చెరువు శిఖం భూములనే వినియోగించారు. మొత్తంగా చెరువుల ఆక్రమణ విషయంలో నీటి పారుదలశాఖ అధికారులు తగిన దృష్టి పెట్టి ఉన్న స్థలాలను కాపాడాల్సిన అవసరముంది.

**టాస్క్‌ఫోర్స్ తనిఖీలేవి?**

ఏడాది కిందట జిల్లా కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధపెట్టి చెరువులు, కుంటల బఫర్ జోన్, ఎఫ్‌టీఎల్(నీటి నిల్వస్థాయి) ప్రదేశాలను గుర్తించాలని సూచించారు. రెవెన్యూ, నీటిపారుదల, భూరికార్డుల సర్వే విభాగం, పోలీసులతో కలిపి టాస్క్‌ఫోర్స్ బృందం ఏర్పాటు చేశారు. కొన్నాళ్లు క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపిన ఈ కమిటీల కార్యాచరణ ప్రస్తుతం కనిపించడం లేదు. పైగా డిజిటల్ గ్లోబల్ పొజిషన్ సర్వే(డీజీపీఎస్), లైడార్ సాంకేతిక సాయంతో నిర్వహించి ఫిర్యాదులు వచ్చిన చోట హద్దులను నిర్ణయించారు. కొన్ని తటాకాలకు మాత్రమే హద్దులు గుర్తిస్తూ మార్కింగ్ చేశారు. అప్పట్లో ఈ ప్రయత్నానికి ప్రజల నుంచి మంచి మద్దతు లభించింది. తర్వాత ఈ ప్రక్రియను టాస్క్‌ఫోర్స్ కమిటీ మరిచిపోయింది.

# ఆయిల్‌పామ్‌కు ఆదరణ



ఎల్లారెడ్డిపేట: ఆయిల్‌పామ్ సాగుపై అధికారులు విస్తృత ప్రచారం చేయటంతో రైతులు ముందుకు వస్తున్నారు. దీంతో జిల్లాలో ఆ పంటకు ఆదరణ లభిస్తోంది. ఏటా సాగు విస్తీర్ణం పెరుగుతోంది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో 4 వేల ఎకరాలకు ఈ తోట సాగును విస్తరించాలని ఇన్‌ఛార్జి కలెక్టర్ గరిమా అగ్రవాల్ ఇటీవల సమీక్ష సమావేశంలో దిశానిర్దేశం చేశారు. జిల్లాలోని 24 పీఏసీఎస్‌ల కింద ఒక్కో దానిపరిధిలో 120 ఎకరాలు, ఉద్యానవన శాఖ అధికారులు 100 ఎకరాలు, వ్యవసాయశాఖ ఏవోలు 20 ఎకరాలు, ఏఈవోలు 10 ఎకరాల లక్ష్యం సాధించాలని సూచించారు. ఈ నేపథ్యంలో ఆయా శాఖల అధికారులు సమన్వయంతో కదిలితేనే లక్ష్యం నెరవేరుతోంది.

**తొలుత 2352 ఎకరాల్లో సాగు**

2022-23 ఆర్థిక సంవత్సరం నుంచి ఆయిల్‌పామ్ సాగుకు శ్రీకారం చుట్టారు. 800 మంది రైతులు 2352 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. ప్రస్తుతం అక్కడక్కడా పంట చేతికందుతోంది. ఇప్పటివరకు 67 మంది రైతులకు చెందిన 257 ఎకరాల్లో జులై నుంచి ఇప్పటి వరకు 110 టన్నుల దిగుబడి వచ్చింది. వచ్చే ఏడాది మార్చిలోగా 400 ఎకరాల విస్తీర్ణంలో కోత ప్రారంభమవుతుందని ఉద్యానశాఖ అధికారులు తెలిపారు. నవంబరు నెలలో ఆయిల్‌పామ్ గెల ధర టన్నుకు రూ.19,681 పలుకుతోంది. ఖర్చులు పోను ఎకరాకు రూ.లక్షకుపైగా లాభం పొందవచ్చు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 700 ఎకరాలకు రైతులు దరఖాస్తు చేసుకోగా 457 ఎకరాలకు మంజూరు లభించింది. 164 ఎకరాల్లో మొక్కలు నాటారు.

**నాలుగేళ్లు నిర్వహణ ఖర్చులు**

జిల్లాలో మొక్కల పంపిణీ మొదలు, పంట ఉత్పత్తుల కొనుగోలు వరకు ప్రీయూనిక్ కంపెనీకి అప్పగించారు. విపణిలో ఒక మొక్క ధర రూ.193గా ఉంది. ప్రభుత్వం నర్సరీల ద్వారా రైతులకు రూ.20కే అందిస్తోంది.

ఎకరానికి 50 మొక్కలు అవసరమవుతాయి. ఈ లెక్కన మొక్కలపై రూ.9650 రాయితీ వస్తోంది. తోట నిర్వహణకు రూ.2100, అంతర పంటల నిర్వహణకు రూ.2100 చొప్పున ఏడాదికి రూ.4200 చెల్లిస్తున్నారు. నాలుగేళ్ల పాటు ఈ మొత్తం రైతులకు అందిస్తారు. బిందుసేద్యం పరికరాలను రాయితీపై అమర్చుతున్నారు. నాలుగో సంవత్సరం నుంచి పంట చేతికందుతోంది. నెలనెలా కోత నిర్వహించాలి. 25-30 సంవత్సరాల వరకు దిగుబడి వస్తుందని అధికారులు అంటున్నారు. ఎకరానికి ఏడాది పాటు 4 నుంచి 5 టన్నులు, ఏడో సంవత్సరం నుంచి ఏటా 10 టన్నులకు పైగా ఆయిల్‌పామ్ గెలలు చేతికి వస్తాయి. ఎలాంటి వాతావరణ పరిస్థితినైనా పంట తట్టుకుంటుంది.

**రైతు పేరిట రిజిస్ట్రేషన్**

పామ్ ఆయిల్ పెంపకానికి రైతులను ప్రోత్సహిస్తున్నాం. మార్కెటింగ్, ప్రకృతి వైపరీత్యాలతో తోటకు ఎలాంటి నష్టం వాటిల్లదు. వన్యప్రాణుల, కోతుల బెడద ఉండదు. రైతు పేరిటే రిజిస్ట్రేషన్ ఉంటుంది కాబట్టి చోరీ భయం అవసరం లేదు. సంబంధిత కంపెనీ కొనుగోలు చేయటంతో మార్కెటింగ్ గ్యారంటీ ఉంటుంది. మొక్కలు, తోట నిర్వహణ, బిందుసేద్యం పరికరాలకు రాయితీ ఉంది.

లత, జిల్లా ఉద్యాన, పట్టుపరిశ్రమ అధికారి

# ఉపయోగం లేక .. రూ.కోట్లు వృథా

పెద్దపల్లి :కాల్వశ్రీరాంపూర్ మండలం ఇప్పలపల్లి గ్రామశివారులో క్రీడా మైదానాన్ని ఏర్పాటు చేశారు. పరికరాలు సమకూర్చారు. స్మశాన వాటిక సమీపంలో ఉండటంలో అటువైపు వెళ్లేందుకు పిల్లలు, క్రీడాకారులు జంకుతున్నారు. అందులో ముళ్ల పొదలు, పిచ్చిమొక్కలు పెరిగాయి. గ్రామీణ ప్రాంతాల్లోని పిల్లలు, విద్యార్థులను ఆటల వైపు మరల్చేందుకు గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలు అలంకారప్రాయంగా మారాయి. చెరువు శిఖం, గుట్ట, పనికిరాని ప్రాంతాల్లో నిర్మించటంతో అందులో సాధన చేసిన నాథుడే లేడు. ఆరేళ్ల క్రితం ఆగమేఘాల మీద ఉపాధిహామీ నిధులు వెచ్చించి క్రీడా ప్రాంగణాలు నెలకొల్పారు. కబడ్డీ, వాలీబాల్, పరుగు పందెం సాధనకు మైదానాన్ని చదును చేసి పరికరాలు బిగించారు. అయితే అధికారుల ముందుచూపు, నిర్వహణ లోపం కరవై రూ.లక్షల ప్రజాధనం వృథాగా మారింది.




**ఒక్కో దానికి రూ.4లక్షల లోపు నిధులు**

ఒక్కో ప్రాంగణానికి రూ.4 లక్షలలోపు ఉపాధిహామీ నిధులు వెచ్చించారు. ఈ లెక్కన జిల్లాలో 266 పంచాయతీల్లో సుమారు రూ.9 కోట్లు కేటాయించి.. నిర్మించారు. గ్రామానికి దూరంగా, స్మశానవాటికల సమీపంలో ఉండటంతో నిరుపయోగంగా మారాయి. పంచాయతీలు మైదానాలు నిర్మించటంలో చూపిన శ్రద్ధ వాటి నిర్వహణలో మరిచా యి. క్రీడా పరికరాలు పొదల్లో తుప్పు పట్టిపోతున్నాయి. ఆరేళ్లలో ఒక్కసారి కూడా వీటిని వినియోగించకపోవటం గమనార్హం. ఎత్తులు, వంకల స్థలాల్లో ఉండటంతో చిరుజల్లులకే బురదమయంగా మారుతున్నాయి.

**మూలన కిట్లు**

సాధనకు ఒక్కో పంచాయతీకి క్రీడా కిట్లు సరఫరా చేశారు. అందులో క్రికెట్, అథ్లెటిక్స్, వాలీబాల్, ఇతరత్రా పరికరాలు ఉన్నాయి. ఇవి పంచాయతీల్లో మూలన మూలుగుతున్నాయి. కొన్నిచోట్ల ఎక్కడ ఉన్నాయో తెలియని పరిస్థితి కూడా నెలకొంది. మైదానాల్లో సాధన చేసే ఉద్దేశంతో వీటిని పంపిణీ చేసినప్పటికీ ప్రభుత్వ ఆశయం అటకెక్కింది. గ్రామీణులు ఆరోగ్య కోసం నడక, వ్యాయామం చేసేందుకు ఆసక్తి చూపుతున్నా.. సరైన వసతులు లేవు. రహదారులపై సాధన చేస్తూ ప్రమాదాల బారిన పడిన ఘటనలు ఉన్నాయి.

# అద్దె పథకం.. మూలన పరికరం

పెద్దపల్లి : స్వయం సహాయక సంఘాల్లోని మహిళల ఆర్థికాభ్యున్నతికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు పథకాలు అమలు చేస్తున్నాయి. రాయితీపై రుణాలు అందిస్తున్నాయి. ఇందులో భాగంగా జాతీయ జీవనోపాధుల మిషన్ ఆధ్వర్యంలో నాలుగేళ్ల కిందట మండలానికి ఒక కస్టమర్ హైరింగ్ సెంటర్‌ను(సీహెచ్‌సీ) మంజూరు చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ పరికరాలను అద్దెకు ఇచ్చి మహిళలు ఉపాధి పొందడం కార్యక్రమ ఉద్దేశం. వివిధ కారణాలతో ఆశయం అటకెక్కి పరికరాలు మూలనపడ్డాయి.

**మండలానికి ఒక యూనిట్**

జాతీయ జీవనోపాధుల మిషన్‌లో కేంద్రం 25 శాతం రాయితీ కల్పించింది. మిగిలిన సొమ్మును మండల సమాఖ్య నుంచి రుణంగా తీసుకొని ట్రాక్టర్, కల్టివేటర్, బేయర్, రొటొవేటర్, ట్రాలీ, కేజ్ వీల్స్, గడ్డికోత యంత్రాలు కొనుగోలు చేశారు. ఒక్కో యూనిట్‌కు రూ.8 లక్షల నుంచి రూ.13 లక్షలు ఖర్చయింది. గ్రామాల్లో వ్యవసాయ పరికరాలను అద్దెకు ఇచ్చి ఉపాధి అవకాశాలు పెంచాలని నిర్ణయించారు. 2021లో ప్రయోగాత్మకంగా జిల్లాకు ఒకటి చొప్పున ఇవ్వగా ఏడాది తర్వాత అన్ని మండలాలకు ఒక్కోటి కేటాయించారు.

**ఎందుకు ఈ పరిస్థితి?**

కొన్ని మండలాల్లో కేంద్రం ఇచ్చిన రాయితీ సొమ్ముతో పాటు మండల సమాఖ్య నుంచి తక్కువ రుణం తీసుకొని కొనుగోలు చేసుకున్నారు. గ్రామాల్లో చాలా మంది రైతులకు ట్రాక్టర్లు, ఇతర పరికరాలు అందుబాటులో ఉండటంతో గిరాకీ తగ్గింది. ప్రచార లోపంతోనూ రైతులు అద్దెకు తీసుకోవడం లేదు. అధికారులు ఈ విషయంపై దృష్టి పెట్టడం లేదు. కరీంనగర్ జిల్లా నగునూరు గ్రామైక్య సంఘం ఆధ్వర్యంలో రూ.12 లక్షలతో పనిముట్లు కొనుగోలు చేశారు. అవసరం ఉన్న రైతులకు అద్దెకు ఇచ్చారు. మొదట్లో కొంత గిరాకీ రావడంతో ఆదాయం సమకూరింది. తరువాత ఆ పరిస్థితి లేదు.

గ్రామాల్లో పెద్ద రైతులు ట్రాక్టర్లు, ఇతర యంత్రాలను కొనుగోలు చేసుకొని అద్దెకు ఇస్తున్నారు. రైతులు వారికి తరువాత డబ్బులు ఇచ్చే అవకాశముండటంతో రైతులు స్వశక్తి సంఘాల నుంచి తీసుకోవడానికి ఆసక్తి చూపడం లేదు.

# పనులు పరుగులు పెట్టాలి

హైదరాబాద్: నవంబరు నెలాఖరుకల్లా సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ పునరాభివృద్ధి పనులు పూర్తి చేయాలని ద.మ.రైల్వే నిర్ణయించుకున్నా ఇప్పటివరకు 60శాతం పనులు కూడా పూర్తవ్వలేదు. రూ.699 కోట్ల అంచనా వ్యయంతో పనులు చేపట్టగా మరో 40 శాతం మిగిలున్నాయి. ఇప్పటికే అనేక రైళ్లను చర్లపల్లి, నాంపల్లి, కాచిగూడకు తరలించినా ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఈ నేపథ్యంలో పనులు పరుగులు పెట్టించాలన్న డిమాండ్లు వెల్లువెత్తుతు



న్నాయి.

**పురోగతిలో ఉన్నవి..**

దక్షిణం వైపు ప్రధాన భవనం, బేస్‌మెంట్ ఉత్తరం వైపు మల్టీలెవెల్ కారు పార్కింగ్ ఉత్తరం వైపు ప్రధాన భవనం, బేస్‌మెంట్ ఎయిర్ కాన్‌కోర్స్ కాజీపేట్ వైపు ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నాంపల్లి వైపు ఫుట్ ఓవర్ బ్రిడ్జి ఫుట్ ఓవర్ బ్రిడ్జితో కూడిన ట్రావెలేటర్. ప్రారంభం 2023 పూర్తి లక్ష్యం 2025 నవంబర్ రోజువారీ ప్రయాణికులు 1,00,000 (ప్రస్తుత అంచనా) రైళ్లు 120

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక
మంగళవారం 25 నవంబర్ 2025

# కళాశాలను బతికిస్తున్నారు

మల్యాల: మల్యాల మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నాలుగేళ్ల కిందట విద్యార్థుల సంఖ్య 150. ఇందులో తరగతులకు హాజరయ్యేది మాత్రం 50 మందే. ప్రస్తుతం మొదటి సంవత్సరంలో 105 మంది, రెండో సంవత్సరంలో 115 మంది చదువుతున్నారు. ఈ మార్పు వెనక అధ్యాపకులు, ప్రిన్సిపల్ సమష్టి కృషి ఉంది. విద్యార్థుల సంఖ్య తగ్గకుండా, వారు నిత్యం కళాశాలకు హాజరయ్యేలా చూడటంతో పాటు నాణ్యమైన బోధన ఇందుకు దోహదపడింది.

**ఆకలి తీరుస్తూ.. అండగా నిలుస్తూ**

దృశ్య, శ్రవణ విధానంలో బోధిస్తే చాలా కాలం గుర్తుండిపోతుందన్న ఆలోచనతో ప్రిన్సిపల్ శివరామకృష్ణ సొంత డబ్బుతో ప్రొజెక్టర్‌ను కొనుగోలు చేశారు. యానిమేషన్ వీడియోలతో పాఠాలు బోధిస్తున్నారు. ఒక్కో అధ్యాపకుడు 15-20 మంది విద్యార్థులను దత్తత తీసుకొని ప్రతి రోజూ కళాశాలకు హాజరయ్యేలా చూస్తున్నారు. విద్యార్థుల గైర్హాజరు, చదువులో పురోగతిపై ఎప్పటికప్పుడు తల్లిదండ్రులకు సమాచారం అందిస్తుంటారు.

తల్లిదండ్రులు లేని, పేద విద్యార్థుల చదువుకు మలబార్ గోల్డ్ సంస్థ అందించే ఆర్థిక సాయం కోసం అధ్యాపకులే స్వయంగా దరఖాస్తు చేస్తున్నారు. కళాశాల నుంచి రెండేళ్ల కిందట 42 మంది, గతేడాది



28 మంది విద్యార్థులు రూ.8 వేల నుంచి రూ.10 వేల ఆర్థిక సాయం పొందారు. ఈ సంవత్సరం 32 మంది దరఖాస్తు చేశారు.

వార్షిక పరీక్షల సమయంలో దాతల సాయంతో కళాశాలలో మధ్యాహ్నం భోజనం అందిస్తున్నారు.

దూర ప్రాంతాల నుంచి వచ్చే పేద విద్యార్థుల రవాణా ఖర్చులను అధ్యాపకులే సమకూరుస్తున్నారు.

విద్యార్థులకు కిచిడీ అందించడానికి ముడి సామగ్రి సమకూర్చడానికి సత్యసాయి సేవా సమితి నిర్వాహకులు ముందుకొచ్చారు.

పేరెంట్ టీచర్ సమావేశానికి అధ్యాపకులు స్వయంగా విద్యార్థుల ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులను ఆహ్వానిస్తున్నారు.

పాఠాలు గుర్తుండిపోతున్నాయి

ప్రొజెక్టర్ సాయంతో యానిమేషన్ వీడియోల ద్వారా బోధించే పాఠాలు గుర్తుండిపోతున్నాయి. అధ్యాపకులు వివిధ రకాల బోధనా సామగ్రిని మాతోనే తయారు చేయించడంతో సబ్జెక్టుపై మరింత అవగాహన పెరుగుతోంది. అధ్యాపకుల ఆర్థిక సాయంతో బల్వంతాపూర్ నుంచి 6 కిలోమీటర్ల దూరంలోని కళాశాలకు వస్తున్నా.

గంగాభవాని, బైపీసీ రెండో సంవత్సరం

విద్యార్థుల హాజరుపై ప్రత్యేక శ్రద్ధ

ఒక్కో అధ్యాపకుడు 15 నుంచి 20 మంది చొప్పున దత్తత తీసుకున్నాం. గైర్హాజరయ్యే విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్ చేస్తాం. కళాశాల జనావాసాలకు దూరంగా ఉండటంతో మధ్యాహ్న భోజనానికి ఇళ్లకు వెళ్తుంటే సమయం వృథా అవుతోంది. సత్యసాయి సేవాట్రస్టు నిర్వాహకులు కిచిడీ అందించడానికి ముందుకొచ్చారు. ఇటీవల మంజూరైన రూ.16 లక్షలతో అవసరమైన వసతులు కల్పిస్తాం.

శివరామకృష్ణ, ప్రిన్సిపల్

# ఆటలకు చోటేది.. పోటీలకు నిధులేవి?

జగిత్యాల : 'క్రీడల అభివృద్ధే లక్ష్యం, క్రీడలతోనే ఆరోగ్యం' ఇవన్నీ వివిధ వేదికలపై ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు చెప్పే మాటలు. కానీ క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే మైదానాలు, క్రీడా సామగ్రి అంతంతే. నిధుల కేటాయింపు అలసత్వంతో ఆటలకంటూ ఓ పీరియడ్ ఉంటుందనే విషయాన్ని విద్యార్థులు మరచిపోతున్నారు. దీంతో విద్యార్థుల్లో శారీరక, మానసిక ఆరోగ్యం ఆశించిన స్థాయిలో ఉండటం లేదు. చాలామందికి క్రీడల్లో ప్రవేశం లేకుండానే విద్యార్థి దశ ముగుస్తోంది. రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచేందుకు అవకాశం కల్పించే ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలకు ప్రభుత్వం నిధులు కేటాయించాలని క్రీడాకారులు అభ్యర్థిస్తున్నారు.

**బాలబాలికల విభాగాల్లో..**

ఉమ్మడి జిల్లాలో ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, బాస్కెట్బాల్, హ్యాండ్‌బాల్, నెట్బాల్, సాఫ్ట్‌బాల్, యోగా, క్రికెట్, అథ్లెటిక్స్ తదితర పోటీలపై ఆసక్తి ఉంది. దీంతో 14 ఏళ్లు, 17 ఏళ్లలోపు బాల, బాలికలకు పోటీలు నిర్వహిస్తున్నారు. ఇటీవల జగిత్యాల జిల్లాలో కథలాపూర్, మెట్పల్లిలో ఖోఖో.. లక్ష్మీపూర్‌లో బాస్కెట్బాల్ పోటీలు, రాజన్న సిరిసిల్ల జిల్లాలో కబడ్డీ, వాలీబాల్ పోటీలు నిర్వహించగా.. ఆసక్తి, ప్రాధాన్యత, ప్రాచుర్యం తదితర పరిస్థితులకనుగుణంగా మండలాలను గుర్తించి ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలు నిర్వహిస్తున్నారు. మిగిలిన చదరంగం, టెండికాయిట్, బ్యాడ్మింటన్, ఈత



తదితర క్రీడలకు పెద్దగా పోటీ లేకపోవడంతో ఎంపికలతోనే సరిపెడుతున్నారు. మొత్తం 50 వరకు క్రీడాంశాలుండగా.. ఉమ్మడి జిల్లాలో పోటీలు, ఎంపికలు చేపట్టే క్రీడల సంఖ్యను వేళ్ల మీద లెక్కపెట్టే పరిస్థితులుండటం గమనార్హం.

**దాతలు ముందుకొస్తేనే నిర్వహణ**

జిల్లా స్థాయి పోటీలకు ప్రభుత్వం నుంచి ఎంతోకొంత నిధులు మంజూరవుతుండగా,.. ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలకు పైసా లేకుండా పోతుంది. వీటి నిర్వహణకు రూ.వేలల్లో నిధులు వెచ్చించాల్సి రావడంతో దాతలపై ఆధారపడటం తప్పనిసరిగా మారింది.

ఇటీవల కథలాపూర్‌లో ఉమ్మడి జిల్లా స్థాయి 14, 17 ఏళ్లలోపు విభాగంలో బాల, బాలికలకు ఖోఖో పోటీలు నిర్వహిస్తే ఒక్కో విభాగంలో నాలుగు జిల్లాల నుంచి 16 జట్లు పాల్గొన్నాయి. 192 మంది క్రీడాకారులు, న్యాయ నిర్ణేతలు, పీడీలు, పీఈటీలు, నిర్వాహకులు కలిపి మొత్తం 250 మందికి భోజనం ఖర్చు రూ.20 వేలు అయింది. సమ దుస్తులు ఒక్కో దానికి రూ.300 చొప్పున రూ.60 వేలు, బహుమతులకు మరో రూ.5 వేలు, నిర్వహణ కోసం టెంట్లు, మైక్, తాగునీరు తదితరాలకు రూ.10 వేలు కలిపి సుమారు రూ.లక్ష వరకు వెచ్చించాల్సి వస్తోంది.

# అధ్వాన దారికి మోక్షం



తాండూరు: తాండూరు నుంచి హైదరాబాద్ వెళ్లే ప్రధాన రోడ్డుకు రహదారులు, భవనాల శాఖ అధికారులు మరమ్మతులు ప్రారంభించారు. తాండూరులో ప్రారంభంలోనే 2 కి.మీ. పొడవున తారు తొలగిపోయి కంకర లేచిన రహదారిని సిమెంటు రోడ్డుగా మారుస్తున్నారు. మూడేళ్లుగా వర్షాకాలంలో ఎగువ నుంచి వరదంతా రోడ్డుపైకి రావడంతో గోతులమయంగా తయారైంది. దీంతో రాకపోకలు సాగించే వందల కొద్ది వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గత వర్షాకాలంలో వరద కారణంగా రహదారి మరింత పాడైంది. మరికొన్ని చోట్ల గుంతలు పడి రాకపోకలకు ప్రతికూలంగా మారింది. తాండూరు నుంచి వ్యాపారులు, ఉద్యోగులు, విద్యార్థులు, సాధారణ ప్రజలు ఈ దారిగుండానే హైదరాబాద్ వెళ్లివస్తుంటారు.

**20 రోజుల్లో గుంతల పూడ్చివేత..**

సిమెంటు రోడ్డు నిర్మాణం పూర్తి కాగానే హైదరాబాద్ రోడ్డుపై ఏర్పడిన గుంతలను పూడ్చాలని ర.భ.శాఖ అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందుకు 20 రోజుల వ్యవధిని నిర్ణయించారు. మొదట రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా చేసి తరవాత రోడ్డును పూర్తిస్థాయిలో తారుతో నిర్మించే ప్రణాళికను రూపొందించారు.

**రెణ్నెల్లలో పూర్తి చేస్తాం..**

– శ్రావణ్‌కుమార్, ఇన్‌ఛార్జి డీఈఈ, తాండూరు

తాండూరు– హైదరాబాద్ రోడ్డును రెణ్నెల్లలో అన్ని విధాలా పూర్తి చేస్తాం. ప్రస్తుతం సిమెంటు రోడ్డు నిర్మిస్తున్నాం. ఇది పూర్తి కాగానే ప్యాచ్ వర్కులు చేస్తాం. తరవాత రహదారిని పూర్తిస్థాయిలో బాగు చేస్తాం. దీనికి రెణ్నెల్ల సమయం పడుతుంది.

రోడ్డు విస్తరణ: 38 కి.మీ.

2 కి.మీ. సిమెంటు రోడ్డు నిర్మాణానికి వ్యయం: రూ.5కోట్లు

మిగిలిన దానికి: రూ.43.80 కోట్లు

# ధ్రువపత్రం..జారీలో అంతరాయం




తాండూరు : జనన, మరణాలు నమోదు చేసేందుకు యూనిఫైడ్ బర్త్ అండ్ డెత్(యూబీడీ) వెబ్‌సైట్ తెరుచుకోవడం లేదు. రోజువారీగా ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది. శిశువు జన్మించిన పక్షం రోజుల్లోనే పూర్తి కావాలి. ఆ తరవాత చేసినా తీసుకోదు. కొన్ని రోజులుగా సైట్ మొరాయిస్తుండడంతో అంతరాయం ఏర్పడుతోందని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫలితంగా జనన, మరణ ధ్రువపత్రాల జారీలో ఇబ్బందులు ఏర్పడుతున్నాయని, అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

**నాలుగు నియోజకవర్గాల పరిధిలో..**

జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల పరిధిలో ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో నిత్యం వందల సంఖ్యలో జనన, మరణాలు చోటుచేసుకుంటున్నాయి. పంచాయతీలు, నాలుగు పురపాలక సంఘాల పరిధిలో సాధారణ మరణాలు నమోదవుతున్నాయి. మీసేవ ఆన్‌లైన్ ద్వారా జనన, మరణ ధ్రువపత్రం తీసుకోవాలంటే ఆస్పత్రిలో జన్మించినట్లు అంతర్జాలంలోని యూబీడీ వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది. ఇలా నమోదైతేనే మీసేవలో అర్జీ పెట్టుకొని.. చిరునామా ప్రకారం పురపాలక సంఘం లేదా పంచాయతీ, మండల అభివృద్ధి అధికారి కార్యాలయానికి చేరుకుంటుంది. సంబంధిత శాఖ అధికారుల డిజిటల్ సంతకంతో ధ్రువపత్రాలు జారీ అవుతాయి.

**నిలిచిన ప్రక్రియ..**

సైట్ పనిచేయకపోవడంతో ధ్రువపత్రాల జారీ ప్రక్రియ నిలిచిపోయింది. పంచాయతీలు, పురపాలక సంఘాల్లో సమస్య ఉత్పన్నమవుతోంది. కొన్ని సందర్భాల్లో సైట్ తెరుచుకొని.. వెంటనే నిలిచిపోతోందని అంటున్నారు. సంబంధిత అధికారులు వెంటనే బాగు చేయించాలని కోరుతున్నారు. సమస్యను ఉన్నతాధికారులకు వివరించామని, త్వరలో పరిష్కరిస్తామన్నారని తాండూరు జిల్లా ఆస్పత్రి, మాతాశిశు ఆస్పత్రి సూపరింటెండెంట్ వినయ్‌కుమార్ తెలిపారు.

# బయోవ్యర్థాలు చెత్తలో వేస్తే ఫోన్ చేయండి




హైదరాబాద్: అనుమతి లేని క్లినిక్‌లు, ల్యాబ్‌లు, ఇళ్లలో చికిత్స తీసుకునే వ్యక్తుల వల్ల బయోమెడికల్ వ్యర్థాలు సాధారణ చెత్తలో కలుస్తున్నాయని పీసీబీ పరిశీలనలో వెల్లడైంది.

**అనుమతులు ఇలా...**

క్లినిక్ నుంచి ఆసుపత్రుల వరకు బయోమెడికల్ వేస్ట్ ట్రీట్‌మెంట్ ఫెసిలిటీతో కచ్చితంగా అనుసంధానం అవ్వాలి. ఆ తర్వాతే కాలుష్య నియంత్రణ మండలి అధీకృత అనుమతి తీసుకోవాలి. అనంతరం డీఎంహెచ్‌వో ఇతర విభాగాలు అనుమతులు ఇవ్వాలి. కొన్ని సందర్భాల్లో ముందు డీఎంహెచ్‌వో ఆరు నెలల పాటు తాత్కాలిక రిజిస్ట్రేషన్‌కు అవకాశమిస్తోంది. గడువులోగా అనుమతులన్నీ తీసుకోవాలి. ఆ తర్వాత శాశ్వత రిజిస్ట్రేషన్‌కు అవకాశం కల్పిస్తారు. ఇలా నమోదు ప్రక్రియ పూర్తయిన తర్వాత ప్రతి ఆసుపత్రి, క్లినిక్‌కు పీసీబీ ఇచ్చిన బార్‌కోడ్‌ను ఆవరణలో అతికిస్తారు. సేకరణ నుంచి శుద్ధి కేంద్రాల తరలింపు వరకు ప్రత్యక్షంగా పర్యవేక్షించేందుకు ఇది దోహదపడుతోంది.

ఇళ్ల నుంచి ఏమేమీ కలుస్తున్నాయంటే..

ప్రెగ్నెన్సీ కిట్లు, మధుమేహ వ్యాధిగ్రస్థులు, ఇతరుల ఇంజెక్షన్‌లు, చికిత్సల్లో వినియోగించే దూది, వ్యక్తిగతంగా వేసుకునే ఇంజెక్షన్లు.

**ఈ నంబర్లలో..**

స్థానిక క్లినిక్‌లు, ఆసుపత్రుల్లో నిబంధనలు ఉల్లంఘించినట్లు కనిపిస్తే కాలుష్య నియంత్రణ మండలి టోల్‌ఫ్రీ నంబరు 040-23887500 లేదా 10741 నంబర్లను సంప్రదించి ఫిర్యాదు చేయొచ్చు.

**గ్రేటర్ పరిధిలో..**

ఆసుపత్రులు: 4వేలు

పడకలు: 60వేలు

రోజూ దవాఖానాల వ్యర్థాలు: 40 టన్నులు

శివారు పురపాలికలు : 20 టన్నులు

# వీరిది ఆందోళన.. వారిది ఆవేదన

షాద్‌నగర్ : ఎప్పుడూ ఏదో ఒక ఆందోళన.. గంటలకొద్దీ రహదారిపై నిలిచిపోయే వాహనాలు.. అత్యవసర పనుల మీద వెళ్లే ప్రయాణికులకు కష్టాలు తప్పట్లేదు. దేశంలోని పలు ముఖ్య ప్రాంతాలకు నగరం నుంచి అనుసంధానంగా రహదారులున్నాయి. ఒక్కోవైపు ఒక్కో జాతీయ రహదారి ఉంది. షాద్‌నగర్, రాజేంద్రనగర్, చేవెళ్ల తదితర ప్రాంతాల నుంచి హైదరాబాద్–బెంగళూరు, ముంబయి బైపాస్ మార్గాలు ఉన్నాయి. ఇవి నిత్యం వాహనాలతో రద్దీగా ఉంటాయి. రాజధానికి ముఖద్వారంగా ఉండే షాద్‌నగర్ పట్టణం మీదుగా మహబూబ్‌నగర్, కర్నూలుతో పాటు రాయలసీమ, కర్ణాటక, తమిళనాడువంటి ప్రాంతాలకు నిత్యం వేల వాహనాలు వెళ్తుంటాయి. ముంబయి బైపాస్‌గా ఏర్పాటు చేసిన పరిగి రోడ్డు మీదుగా కూడా పరిశ్రమలకు సరకులు చేరవేసే లారీలు పెద్దఎత్తున రాకపోకలు సాగిస్తున్నాయి. బైపాస్ రోడ్డు ఉన్నప్పటికీ రైల్వేగేటు ఉండడంతో ఎక్కువ శాతం వాహనాలు ప్రధాన మార్గంలో ప్రయాణిస్తుంటాయి. నిత్యం వేలల్లో వాహనాలు రోడ్డు ఎక్కుతున్నాయి. ఎక్కడ చిన్నధర్నా జరిగినా గంటల కొద్దీ వాహనాలు నిలిచిపోతున్నాయి.

సంఘటన ఏదైనా.. అక్కడే

ఏ నిమిషానికి ఏం జరుగుతుందో అర్థం కాని అయోమయ పరిస్థితి షాద్‌నగర్ కూడలిలో కనిపిస్తోంది. ఏ హత్య జరిగినా, అన్యాయం జరిగినా, ప్రభుత్వాలకు వ్యతిరేకంగా ఆందోళనలు చేసినా, ప్రభుత్వ కార్యక్రమాలకు సంబంధించి సంబరాలు చేసుకున్నా రహదారులే అడ్డాగా మారుతున్నాయి. ఇటీవల తమను ప్రిన్సిపల్ వేధిస్తున్నారనే ఆరోపణపై గురుకుల విద్యార్థులు సుమారు 4 గంటలు రహదారిపై ఆందోళన చేశారు. ఇలాంటి సమయాల్లో వందల సంఖ్యలో వాహనాలు నిలిచిపోతున్నాయి. రోగులు, గర్భిణులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అత్యవసర వాహనాలూ కదిలే పరిస్థితి ఉండట్లేదు. పోలీసులు దృష్టి పెట్టి రహదారులపై వాహనాలను అడ్డుకోకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

# ప్రాణ వాయువుకే.. ఆయువు తీరింది

నల్గొండ: అత్యవసర సమయంలో రోగులకు ప్రాణవాయువు అందించే ఆక్సిజన్ ప్లాంట్లు నిరుపయోగంగా ఉన్నాయి. కొన్నిచోట్ల విద్యుత్తు బిల్లుల మోత పెరగడంతో నిర్వహణ ఆపేశారు. కరోనా సమయంలో శ్వాసకోస సమస్యలు తలెత్తి.. పలువురు ఆక్సిజన్ అందక ప్రాణాలు కోల్పోయారు. దీంతో ప్రభుత్వం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఆక్సిజన్ ప్లాంట్లు నిర్మించాలని ఆదేశించింది. అయితే రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన ప్లాంట్లు నిరుపయోగంగా మారాయి.

**ఆసుపత్రుల్లో వినియోగం ఇలా..**

ఒక్కో జిల్లాసుపత్రిలో అన్ని విభాగాలు కలిపి రోజూ 800 మంది ఓపీ నమోదవుతుంది. ఐపీ 300 మంది వరకు ఉంటారు. గర్భిణులు వైద్యసేవలకు ఎక్కువగా తరలివస్తారు. ఐసీయూ, అత్యవసర సేవలు, శస్త్రచికిత్స విభాగాల్లో సెంట్రల్ ఆక్సిజన్ సిస్టం ఏర్పాటు చేశారు. ప్రస్తుతం సంప్రదాయ ఆక్సిజన్ సిలిండర్లను మాత్రమే వినియోగిస్తున్నారు. ప్రతి నెల గరిష్ఠంగా ఒక్కో ఆసుపత్రిలో 10 వరకు వాడుతున్నారు. ఒక్కో ఆసుపత్రిలో గరిష్ఠంగా రూ.60 లక్షలతో నిర్మించిన 500, 1000 లీటర్ ఫర్ మినిట్(ఎల్పీఎం) సామర్థ్యం కలిగిన ఆక్సిజన్



ప్లాంట్లను ఏర్పాటు చేశారు. ఐసీయూతో పాటు ఆక్సిజన్ అవసరం ఉన్న అన్ని విభాగాలకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

నల్గొండ జిల్లాసుపత్రిలోనూ లిక్విడ్ ఆక్సిజన్ ప్లాంట్‌ను నిర్మించినా.. విద్యుత్తు బిల్లులు ఎక్కువ రావడం, వినియోగం తక్కువగా ఉండటంతో సిలిండర్లను వినియోగిస్తున్నారు.

దేవరకొండ ప్రాంతీయాసుపత్రిలో టెక్నీషియన్ లేక నిరుపయోగంగా ఉంది. మిర్యాలగూడ ప్రాంతీయ ఆసుపత్రిలో ప్రత్యేకంగా ఆక్సిజన్ సిలిండర్లు అమర్చే ఏర్పాటు చేశారు. అవసరమైనప్పుడు అనుసంధానిస్తున్నారు. గతంలో ఎన్నారై ఫోరం వారు ఆక్సిజన్ ప్లాంట్ నిర్మించాలని ప్రతిపాదించగా స్థలం సైతం కేటాయించారు.

నకిరేకల్, మునుగోడులో నిర్మించినా ప్రారంభించలేదు. చండూరు ఆసుపత్రిలో ఏర్పాటు చేయలేదు.

నాగార్జునసాగర్ కమల నెహ్రూ ప్రాంతీయ ఆసుపత్రిలో నిర్మించినా.. విద్యుత్తు ఖర్చులు పెరుగుతుండటంతో సిలిండర్లను వినియోగిస్తున్నారు.

గుత్తేదారుల నిర్లక్ష్యం వల్లే నిర్వహణ కష్టాలు

కరోనా సమయంలో ఒక్కో సెంట్రల్ ఆక్సిజన్ సిస్టంను జిల్లాసుపత్రిలో, తక్కువ పడకలున్న చోట్ల మినీ లిక్విడ్ ఆక్సిజన్ ట్యాంకులను నిర్మించి వదిలేశారు. దేవరకొండలో నెలకు రూ.40వేల వరకు విద్యుత్తు బిల్లులు వస్తుండటం, మరమ్మతులకు గురవుతుండటంతో సిలిండర్లు వినియోగిస్తున్నారు. గుత్తేదారుల సంస్థ కొన్ని ప్రాంతీయాసుపత్రుల్లో బిల్లులు రాక సగం నిర్మించి వదిలేశారు. నిర్మించిన చోట్ల మరమ్మతులు వచ్చినా పట్టించుకోవడం లేదు. డా.మాతృనాయక్, జిల్లాసుపత్రుల పర్యవేక్షకుడు, నల్గొండ

# ఆవాసంలో.. ఉంటలేరు నివాసం!

ఆత్మకూరు : సొంత గూడు లేని పేదల కల నెరవేర్చేందుకు గత ప్రభుత్వం రెండు పడక గదుల ఇళ్ల పథకం ప్రారంభించి, నిర్మాణాలు పూర్తి చేసింది. నాసిరకంగా నిర్మించారని, పూర్తిస్థాయిలో వసతులు కల్పించలేదని గృహప్రవేశాలు చేసిన లబ్ధిదారులు వాపోతున్నారు. జిల్లాలో పరిశీలన చేయగా..పలు సమస్యలు వెలుగులోకి వచ్చాయి. భువనగిరి పట్టణం సింగన్నగూడెంలో జి- ప్లస్-2 విధానంలో 560 మంజూరు కాగా. 48 ఇళ్ల పనులు మధ్యలో నిలిచిపోయాయి. ఇటీవల ప్రభుత్వం రూ.2.55 కోట్లు నిధులు మంజూరు చేయడంతో డ్రైనేజీ, మంచినీటి, విద్యుత్తు, సీసీ దారుల పనులు కొనసాగుతున్నాయి. మోటకొండూరు మండలం ఆరెగూడెంలో నిర్మించిన 44 ఇళ్లు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలో అడవిలో నిర్మించడంతో సరైన రహదారి లేదు. సౌకర్యాలు లేక సగం మంది అక్కడ ఉండటం లేదు.

ఆలేరు పట్టణం, కొలనుపాక గ్రామంలో 64 చొప్పున ఇళ్లను నిర్మించి అప్పగించారు. ఆలేరులో పట్టణంలో ఇళ్ల పక్కనే మురుగు నిలిచి దుర్గంధం వస్తోంది.

యాదగిరిగుట్ట మండలం వంగపల్లిలో 40 ఇళ్లను నిర్మించి, లబ్ధిదారులను ఎంపిక చేసినా అప్పగించలేదు. చెరువు సమీపంలో నిర్మించడం వల్ల వర్షాకాలం ఇళ్ల మధ్యకు నీరు చేరుతోంది. ఇళ్ల మధ్యకు నీరు రాకుండా ఈ ఏడాది కట్ట ఏర్పాటు చేశారు. అయినా వెళ్లేందుకు లబ్ధిదారులు ఆసక్తి చూపడం లేదు.

ఆత్మకూరు(ఎం)లో నిర్మించిన 48 ఇళ్లలో రెండున్నర ఏళ్ల క్రితం



గృహప్రవేశాలు చేయించారు. సామూహిక సెప్టిక్ ట్యాంక్ నిర్మాణం లేక మరుగుదొడ్లు వినియోగించడం లేదు. కిటికీలకు అద్దాలు బిగించలేదు. మురుగు కాల్వలు, సీసీ దారులు లేవు. విద్యుత్తు తీగలు ప్రమాదకరంగా ఇంటి గోడలను తాకుతున్నాయి. కనీస వసతులు లేక 48 మంది లబ్ధిదారులకు ప్రస్తుతం 15 మంది మాత్రమే ఉంటున్నారు. చెత్త సేకరణ ట్రాక్టర్, వీధుల శుభ్రతకు పంచాయతీ సిబ్బంది రావడం లేదు. ఉప్పలపహాడ్‌లో 45 ఇళ్లు నిర్మించినా డ్రైనేజీ, సీసీ దారులు ఏర్పాటు చేయలేదు.

జిల్లాలో రెండు పడక గదుల ఇళ్ల వివరాలు..

మంజూరు చేసినవి : 3,620

పరిపాలనా ఆమోదం : 3,464

పనులు ప్రారంభించినవి: 1412

లబ్ధిదారుల ఎంపిక జరిగినవి: 945

అప్పగించినవి : 461

లబ్ధిదారులను ఎంపిక చేయాల్సినవి : 197

పనులు ప్రారంభించనివి: 2,051

ప్రగతిలో ఉన్నవి : 120 ఇళ్లు




# కోకాపేట.. ఎకరం ధర రూ.137 కోట్లు

హైదరాబాద్: నగర శివారులోని కోకాపేటలో భూములు రికార్డు ధర పలికాయి. ఎకరం ధర అత్యధికంగా రూ.137.25 కోట్లు పలికింది. కోకాపేటలోని నియోపోలిస్ ప్రాంతంలోని సర్వే నంబర్ 17, 18లోని భూములకు వేలం నిర్వహించగా.. సర్వే నంబర్ 17లోని భూమి ఎకరం 137.25 కోట్లు పలికింది. హెచ్ఎండీఏ పరిధిలోని ఖరీదైన భూములను ఆన్‌లైన్‌లో వేలం వేయడానికి ప్రభుత్వం నిర్ణయించి నోటిఫికేషన్ జారీ చేసిన సంగతి తెలిసిందే. ఇటీవల రాయదుర్గంలో 7.67 ఎకరాలకు తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ(టీజీఐఐసీ) నిర్వహించిన వేలంపాటలో రూ.1,357 కోట్లకు ఓ సంస్థ దక్కించుకుంది. ఇక్కడ కనీస ధర ఎకరాకు రూ.101 కోట్లుగా నిర్ణయించగా.. వేలంలో రూ.177 కోట్లు పలికింది. ఈ నేపథ్యంలో తాజాగా కోకాపేట నియోపోలిస్‌లోని సర్వే నంబర్ 17, 18లోని భూములను హెచ్ఎండీఏ వేలం వేసింది. ఎకరా కనీస ధర రూ.99 కోట్లుగా నిర్ణయించగా.. అత్యధికంగా రూ.137.25 కోట్లు పలికింది.




కొడంగల్: కొడంగల్‌లో ఏ విద్యార్థీ ఆకలితో ఉండకూడదన్న లక్ష్యంతో ఏర్పాట్లు చేస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రస్తుతం నియోజకవర్గంలో 28 వేల మందికి ఉదయం అల్పాహారం అందిస్తున్నామన్నారు. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో 5 వేల మంది విద్యార్థులు పెరిగారని చెప్పారు.

వికారాబాద్ జిల్లా కొడంగల్ పర్యటనకు వెళ్లిన రేవంత్ రెడ్డి.. అక్కడి అక్షయపాత్ర ఫౌండేషన్ కిచెన్‌ను పరిశీలించారు. మిడ్‌డే మీల్స్ కిచెన్ భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. “జీవితాల్లో మార్పు రావాలంటే పిల్లల్ని చదివించాలి. కొడంగల్‌లో రూ.5వేల కోట్లతో ఎడ్యుకేషన్ క్యాంపస్ నిర్మిస్తున్నాం. రాష్ట్రంలో తొలి సైనిక్ స్కూల్‌ను ఇక్కడే ఏర్పాటు చేయబోతున్నాం. 16 నెలల్లోగా కొడంగల్‌ను అంతర్జాతీయ ఎడ్యుకేషన్ హబ్‌గా తయారు చేస్తాం. మహిళలు ఆత్మగౌరవంతో బతికేందుకు కృషి చేస్తున్నాం. రాష్ట్రంలోని ప్రజలకు సన్న బియ్యం పంపిణీ చేస్తున్నాం. మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం కల్పిస్తున్నాం. వెయ్యి ఆర్టీసీ బస్సులకు వారిని యజమానులుగా చేశాం. సోలార్ పవర్ ప్లాంట్లు, పెట్రోల్ బంకులకు కూడా యజమానులను చేశాం. అదానీ, అంబానీలతో పోటీపడేలా వారిని ప్రోత్సహిస్తున్నాం.

మహిళా సంఘాల ఉత్పత్తులు అమెజాన్‌లో అమ్ముకునేలా ఏర్పాట్లు చేస్తున్నాం. మూడు నెలల్లో కొడంగల్‌లోని ప్రతి గ్రామానికి కృష్ణా నీళ్లు అందిస్తాం. లగచర్ల పారిశ్రామికవాడకు అంతర్జాతీయస్థాయి గుర్తింపు తీసుకొస్తాం. తెలంగాణ నోయిడాగా కొడంగల్ నియోజకవర్గాన్ని తీర్చిదిద్దుతాం. రాబోయే కొన్ని నెలల్లో కొడంగల్ రైల్వే పనులు ప్రారంభమవుతాయి. నియోజకవర్గంలో సిమెంట్ పరిశ్రమ ఏర్పాటు చేయబోతున్నాం. త్వరలో సర్పంచ్ ఎన్నికలు రాబోతున్నాయి.

3, 4 రోజుల్లో సర్పంచ్ ఎన్నికలకు నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉంది. అభివృద్ధికి మద్దతుగా ఉండేవారిని సర్పంచ్‌లుగా ఎన్నుకోవాలి” అని రేవంత్ పిలుపునిచ్చారు.

# వనపర్తిలో మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి భారీ అవినీతి: కవిత




కొత్తకోట: పదేళ్ల భారత రాష్ట్ర సమితి పాలనలో వనపర్తి పెద్దగా అభివృద్ధి చెందలేదని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత అన్నారు. మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి అవినీతితో నియోజకవర్గంలో BRSకి కోలుకోలేని దెబ్బ తగిలిందని చెప్పారు. వనపర్తి జిల్లా కొత్తకోటలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. నిరంజన్‌రెడ్డి మూడు, నాలుగు ఫాంహౌస్‌లు కట్టుకున్నారని.. చెప్పలేనంత అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. నియోజకవర్గంలో ఆయన రాచరిక పాలన సాగించారన్నారు. ఇలాంటి అవినీతిపరుడిని చిత్తుగా ఓడించడం సరైన నిర్ణయమని చెప్పారు. తన గురించి మరోసారి ఎక్కడైనా మాట్లాడితే తాట తీస్తానని నిరంజన్‌రెడ్డిని ఉద్దేశించి కవిత ఘాటుగా వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పాలనలో చేనేత కార్మికులు ఎలాంటి లబ్ధి పొందలేదని కవిత అన్నారు. రుణమాఫీ కూడా చేయలేదని విమర్శించారు. “కొత్తకోట మండలం కానాయపల్లి శంకర సముద్రం నిర్వాసితులకు తక్షణమే పరిహారం అందించాలి. మల్లన్నసాగర్, మిడ్ మానేరు లబ్ధిదారులకు ఎలా ఇళ్లు నిర్మించి ఇచ్చారో అలాగే ఇవ్వాలి. సీఎం రేవంత్‌రెడ్డి ధరణి స్థానంలో భూభారతి తీసుకొచ్చినా చిన్నచిన్న తప్పులతో చాలా మంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వైద్యంపై ప్రభుత్వం దృష్టి సారించాలి. పెబ్బేరులో మూడువేల మెట్రిక్ టన్నుల గన్నీ బ్యాగుల గోదాం కాలిపోతే ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు లేవు” అని కవిత అన్నారు.

# పటాన్‌చెరు ఎమ్మెల్యే సోదరుడి ఆస్తులు అటాచ్ చేసిన ఈడీ




హైదరాబాద్: పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి సోదరుడి ఆస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అటాచ్ చేసింది. మధుసూదన్‌రెడ్డికి చెందిన రూ.80కోట్లు అటాచ్ చేసినట్లు సమాచారం. మధుసూదన్‌రెడ్డికి చెందిన సంతోష్ శాండ్ అండ్ గ్రానైట్ కంపెనీ రూ.300 కోట్ల అక్రమాలు చేసిందని, అంతే కాకుండా ప్రభుత్వానికి మధుసూదన్‌రెడ్డి రూ.39 కోట్ల రాయల్టీ చెల్లించలేదని ఆరోపణలు వచ్చాయి. దీంతో ఈడీ విచారణ చేపట్టింది. ఈ క్రమంలోనే ఆస్తుల్ని అటాచ్ చేసింది.




ప్రముఖ నటుడు ధర్మేంద్ర (89) తుదిశ్వాస విడిచారు. గతకొంత కాలంగా శ్వాసకోశ సమస్యలతో బాధపడుతున్న ఆయన ఆరోగ్యం.. సోమవారం (నవంబరు 24) విషమించడంతో కన్నుమూశారు. అక్టోబరు 31న ధర్మేంద్ర అనారోగ్యం పాలవగా, ముంబయిలోని బ్రీచ్ క్యాండీ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ఈ క్రమంలో ఆయన చనిపోయారంటూ సామాజిక మాధ్యమాల వేదికగా వార్తలు వైరల్ అయ్యాయి. రొటీన్ చెకప్ కోసమని ఆస్పత్రికి తీసుకెళ్లామని ఆయన కుటుంబం తెలిపారు. ధర్మేంద్ర ఆరోగ్యం నిలకడగానే ఉందని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని హేమ మాలిని, సన్నీ దేవోల్ అభిమానులకు విజ్ఞప్తి చేశారు.

ధర్మేంద్ర కోలుకోవాలని అభిమానులు సోషల్ మీడియా వేదికగా ఆకాంక్షించారు. ఈ క్రమంలో సోమవారం ధర్మేంద్ర ఆరోగ్యం విషమించడంతో ఆయన కన్నుమూశారు. సినీ ప్రముఖులు ఆయనకు నివాళులర్పిస్తున్నారు. ఆయనతో ఉన్న అనుబంధాన్ని సోషల్ మీడియా వేదికగా గుర్తుచేసుకుంటున్నారు.

ధర్మేంద్ర పార్థివ దేహాన్ని కుటుంబ సభ్యులు అంబులెన్స్‌లో స్థానిక విల్లే పార్లీ శ్మశాన వాటికకు తరలించారు. ధర్మేంద్ర కన్నుమూశారన్న సమాచారం తెలుసుకున్న సినీ, రాజకీయ ప్రముఖులు ఆయన భౌతిక కాయాన్ని కడసారి చూసేందుకు శ్మశాన వాటికకే తరలివచ్చి, నివాళులర్పించారు. ధర్మేంద్ర మృతిపట్ల దర్శక, నిర్మాత కరణ్‌జోహర్ విచారం వ్యక్తం చేశారు. ఆయన్ను గుర్తు చేసుకుంటూ ఇన్‌స్టా వేదికగా పోస్ట్ పెట్టారు. ఒక శకం ముగిసిందన్నారు. ‘మెగాస్టార్, గొప్ప అందగాడు, ఇండియన్ సినిమా లెజెండ్ వన్ అండ్ ఓన్లీ ధర్మేంద్రజీ మిమ్మల్ని ఎంతో మిస్ అవుతున్నాం’ అని పేర్కొన్నారు.

**బాలీవుడ్ హీ-మ్యాన్..** ధర్మేంద్ర 1935 డిసెంబరు 8న జన్మించారు. ఆయన పూర్తి పేరు ధర్మేంద్ర కెవల్ క్రిషన్ దేవోల్. 1954లో ప్రకాశ్‌కౌర్‌ను వివాహం చేసుకున్నారు. 1980లో బాలీవుడ్ సీనియర్ నటి హేమమాలినిని రెండో వివాహం చేసుకున్నారు. ధర్మేంద్రకు సన్నీ, బాబీ, ఈషా సహా ఆరుగురు సంతానం. బాలీవుడ్ హీ-మ్యాన్‌గా పేరుతెచ్చుకున్న ఆయన నటనకు అనేక అవార్డులు వచ్చాయి. చిత్ర పరిశ్రమకు ఆయన చేసిన సేవలకు గానూ కేంద్ర ప్రభుత్వం 2012లో పద్మభూషణ్‌తో సత్కరించింది. ధర్మేంద్ర రాజకీయాల్లోనూ రాణించారు. 2004లో బికనీర్ నుంచి భాజపా ఎంపీగా గెలుపొందారు.

1960లో ‘దిల్ బీ తేరా హమ్ బీ తేరా’తో నటుడిగా కెరీర్‌ను ఆరంభించిన ఆయన ‘అన్‌పఢ్ ’, ‘బందినీ’, ‘అనుపమ’, ‘ఆయా సావన్ జూమ్ కే’ తదితర చిత్రాలతో నటుడిగా మంచి పేరు తెచ్చుకున్నారు. ఆ తర్వాత ‘షోలే’, ‘ధర్మవీర్’, ‘చుప్కే చుప్కే’, ‘మేరా గావ్ మేరా దేశ్’, ‘డ్రీమ్ గర్ల్’ వంటి చిత్రాలు బాక్సాఫీస్ వద్ద ఘన విజయాన్ని నమోదు చేశాయి. ధర్మేంద్ర కెరీర్‌లో దాదాపు 300లకు పైగా చిత్రాల్లో నటించారు. చివరిగా షాహిద్ కపూర్, కృతి సనన్‌ల ‘తేరీ బాతోమే ఐసా ఉల్జా జియా’ చిత్రంలో వెండితెరపై కనిపించారు. ఆయన చివరి చిత్రం ‘ఇక్కీస్’ త్వరలో విడుదల కానుంది.



# హైదరాబాద్‌లో భూముల అమ్మకంపై ప్రభుత్వాన్ని నిలదీయండి: కార్పొరేటర్లతో కేటీఆర్

హైదరాబాద్: పార్టీ వెంటే ఉన్న ప్రతి కార్పొరేటర్‌కు భవిష్యత్తులో మరిన్ని పదవులు వస్తాయని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. తెలంగాణ భవన్‌లో జీహెచ్ఎంసీ పరిధిలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేటర్లతో ఆయన సమావేశమయ్యారు. బల్దియా సమావేశంలో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్లకు కేటీఆర్ దిశానిర్దేశం చేశారు. పదేళ్ల పాటు ఎలాంటి అవినీతికి తావు లేకుండా పనిచేశారని.. కరోనా వంటి తీవ్ర సంక్షోభంలోనూ అద్భుతంగా సేవలందించారని కొనియాడారు. ప్రతిపక్షంలోకి వచ్చిన తర్వాత కార్పొరేటర్లు ఎప్పటికప్పుడు ప్రజా సమస్యలపై పోరాటం చేశారన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో పోరాడిన తీరుకు కేటీఆర్ అభినందనలు తెలిపారు. పరిశ్రమలకు కేటాయించిన వాటితో పాటు హైదరాబాద్‌లో భూముల అమ్మకంపై బల్దియా సమావేశంలో నిలదీయాలని ఆయన సూచించారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో ప్రభుత్వ వైఫల్యంపై నిలదీయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎప్పుడు జీహెచ్ఎంసీ ఎన్నికలు నిర్వహించినా సిద్ధంగా ఉండాలని.. అందరినీ పార్టీ గెలిపించుకుంటుందని కేటీఆర్ భరోసా ఇచ్చారు.




హైదరాబాద్: నగర సీపీ వీసీ సజ్జనార్ ఆదివారం అర్ధరాత్రి పెట్రోలింగ్ చేశారు. లంగర్ హౌస్, టోలిచౌకి ప్రాంతాల్లో అర్ధరాత్రి 12 నుంచి తెల్లవారుజాము 3 గంటల వరకు రౌడీషీటర్ల ఇళ్లకు వెళ్లి ఆకస్మిక తనిఖీలు చేశారు. వారి నేర చరిత్ర, జీవనశైలిపై ఆరా తీశారు. నేర ప్రవృత్తి మానుకోవాలని సూచించారు. రాత్రి వేళల్లో తెరిచి ఉన్న దుకాణాల నిర్వాహకులను సీపీ హెచ్చరించారు. పెట్రోలింగ్ సిబ్బంది అప్రమత్తతను తనిఖీ చేసి గస్తీ పాయింట్లు, స్పందన వేగంపై సమగ్ర పరిశీలన చేశారు. నగర భద్రతపై కఠిన పర్యవేక్షణ కొనసాగుతుందని వెల్లడించారు.

# ముగిసిన ఐబొమ్మ రవి పోలీస్ కస్టడీ.. చంచల్‌గూడ జైలుకు తరలింపు

హైదరాబాద్: సినిమాల పైరసీ కేసులో నిందితుడు, ఐబొమ్మ వెబ్‌సైట్ నిర్వాహకుడు రవి ఐదు రోజుల పోలీస్ కస్టడీ ముగిసింది. దీంతో సైబర్ క్రైమ్ పోలీసులు అతడికి వైద్య పరీక్షలు చేయించి.. నాంపల్లి కోర్టులో హాజరు పర్చారు. అనంతరం చంచల్‌గూడ జైలుకు తరలించారు. ఐదు రోజుల కస్టడీలో రవి కీలకమైన విషయాలను వెల్లడించినట్లు సమాచారం.






పాకిస్థాన్‌లో మంగళవారం ఆత్మాహుతి దాడి చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఇద్దరు పారా మిలిటరీ సిబ్బంది మరణించగా.. పలువురు గాయపడ్డారు. పెషావర్‌లోని ఫ్రంటియర్ కోర్ ప్రధాన కార్యాలయంపై ఉగ్రవాదులు దాడులు చేయడంతో పారామిలిటరీ కార్యాలయం కాంపౌండ్ లోపల వరుస పేలుళ్లు సంభవించినట్లు పాక్ అధికారులు వెల్లడించారు. పాక్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం తెల్లవారుజామున పెషావర్‌లోని ఫ్రంటియర్ కోర్ ప్రధాన కార్యాలయం గేట్ వద్ద పేలుడు సంభవించింది. అనంతరం సమీపంలోని సైకిల్ స్టాండ్ వద్ద మరో పేలుడు చోటుచేసుకుంది. కార్యాలయాన్ని ముగ్గురు ఉగ్రవాదులు ముట్టడించినట్లు కనుగొన్న భద్రతా బలగాలు వారిపై కాల్పులు జరిపారు. ఇరువర్గాల మధ్య జరిగిన కాల్పుల్లో ఇద్దరు పారామిలిటరీ సిబ్బంది మరణించగా.. నలుగురు గాయపడ్డారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. బాంబు దాడి జరిగిన వెంటనే రెస్క్యూ బృందాలు ఘటనాస్థలికి చేరుకొని సహాయక చర్యలు ప్రారంభించినట్లు స్థానిక అధికారులు పేర్కొన్నారు. ప్రస్తుతం ఆ ప్రాంతంలో లాక్‌డౌన్ విధించినట్లు తెలిపారు. భద్రతా బలగాలు, స్క్వాడ్ బృందాలు ఆ ప్రాంతాన్ని తమ అధీనంలోకి తీసుకొని తనిఖీలు చేపట్టాయి. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. దాడులకు సంబంధించి బాధ్యత వహిస్తూ ఏ ఉగ్ర సంస్థ ఇంతవరకు ప్రకటన చేయలేదు.

PRINTED, PUBLISHED, EDITED AND OWNED BY SYED. KAREEM. PRINTED AT MUZAMMIL PRINTERS BOKKALGUDA, ADILABAD-504001
PUBLISHED AT D.NO. 4-4-122/10/B, VIDYANAGER, ADILABAD - 504001. TELANGANA STATE, REGD. NO. APTEL/2011/41055 ìEDITOR : SYED. KAREEMî CELL - 94409 77660